క్లుప్తంగా

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

బొండపల్లి: మాఘమాస ఏకాదశిని పురస్కరించుకుని దేవుపల్లి గ్రామంలోని రాజ రాజేశ్వరీదేవి అమ్మవారి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రధాన అర్చకులు దూసి శ్రీధర్ శర్మ పూజలు, అభిషేకాలు చేయించారు.

దోమల నివారణకు ఫాగింగ్



ఫాగింగ్‌ను పర్యవేక్షిస్తున్న పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ రాము

చీపురుపల్లి: దోమల నివారణకు చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని కస్పావీధి, గవిడివీధి, లావేరురోడ్ తదితర ప్రాంతాల్లో సోమవారం ఫాగింగ్ చేపట్టారు. పారిశుద్ధ్యంపై నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వార్డుల్లో యంత్రాలతో పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చేస్తున్నారు. అలాగే కాలువల్లో పూడిక తీస్తున్నారు. పరిశుభ్రత పాటించాలని, ఎక్కడపడితే అక్కడ చెత్తపారబోయవద్దని ప్రజలకు పంచాయతీ సిబ్బంది సూచించా రు. పరిసరాల పరిశుభ్రతతోనే దోమల నివారణ సాధ్యమని అవగాహన కల్పిస్తున్నారు.

గడ్డి వాములు దగ్ధం



కళ్లాల వద్ద దగ్ధమైన గడ్డివాములు

దత్తిరాజేరు: మండలంలోని కె.కొత్తవలసలో సోమవారం తెల్లవారు జామున గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో ఎనిమిది మంది రైతులకు చెందిన గడ్డి వాములు, ధాన్యం దగ్ధమయ్యాయి. గ్రామ సమీపంలో ఉన్న పశువుల శాలల వద్ద ఉన్న పశువులను బయటకు పంపించి శాలలు, గడ్డి వాములకు నిప్పంటించడంతో మత్స ఈశ్వరరావు, మరడ సింహాచలం, మరడ శంకరరావుల ధాన్యం కుప్పలు, మరడ చిన్నశ్రీను, పప్పల ఈశ్వరరావు, మత్స అన్నపూర్ణకు చెందిన గడ్డి వాములు దగ్ధమవడంతో సుమారు రూ.ఐదు లక్షల వరకు ఆస్తినష్టం జరిగిందని సమాచారం అందిన వెంటనే బాడంగి నుంచి అగ్నిమాపక శకటం రావడంతో కొంతమందికి నష్టం జరగలేదని రైతులు చెప్పారు.

సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

గజపతినగరం రూరల్: ఎక్సైజ్ స్టేషన్ పరిధి మెంటాడ మండలంలోని వానిజ గ్రామానికి చెందిన గుమడాపు ముత్యాలు సోమవారం రెండు లీటర్ల సారా తరలిస్తుండగా దాడి చేసి పట్టుకున్నామని ఎక్సైజ్ సీఐ జనార్దనరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ సారా కాచినా, అక్రమంగా తరలించినా కేసులు నమోదుచేయనున్నట్లు చెప్పారు. సారా తరలించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి సబ్‌జైలుకు పంపించామన్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు పోటీలు



పరుగు తీస్తున్న ఎడ్లు

వేపాడ: మండలంలోని మైచర్ల శింగవరం గ్రామంలో వీరసత్యం తీర్థం సందర్భంగా సోమవారం సాయంత్రం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. అనకాపల్లి, విజయనగరం జిల్లాలకు చెందిన 12 జతల ఎడ్లు పాల్గొనగా, వావిలపాడుకు చెందిన మరిడిమాంబ ఎడ్లు విజేతగా నిలిచాయి. మొదటి అయిదు స్థానాల్లో నిలిచిన ఎడ్లకు సంబంధించిన యజమానులకు సర్పంచ్ కర్రి యశోద, వైస్ సర్పంచ్ కోట్ని కృష్ణ, పెద్దలు మైచర్ల అప్పన్నదొర, రాముసాయుడు నగదు బహుమతులు అందజేశారు.

పుట్టుకతో లోపాలు గల పిల్లలను గుర్తించాలి

విజయనగరం ఫోర్ట్: పుట్టుకతో లోపాలు గల పిల్లలను గుర్తించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జీవనరాణి తెలిపారు. ఆర్‌బీఎస్‌కే స్క్రీనింగ్‌లో భాగంగా 1 నుంచి 18 ఏళ్ల గల పిల్లల్లో లోపాలను గుర్తించి రవాణా చేసేందుకు రిఫరల్ వాహనాన్ని సోమవారం ఆమె జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే డాక్టర్ సుబ్రహ్మణ్యం, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, డీఎంఓ మణి తదితరులు పాల్గొన్నారు.

డీపట్టాదారులపై కుట్ర..!

- డీపట్టా భూములను హోల్డ్‌లో పెట్టిన ప్రభుత్వం
- గంట్యాడ మండలంలో 350 ఎకరాలపై రైతులకు పూర్తి హక్కులు కల్పించిన వైఎస్సార్‌సీపీ
- కూటమి ప్రభుత్వం నిర్ణయంపై మండిపడుతున్న పట్టాదారులు



మురపాక గ్రామంలోని డీపట్టా భూములు

గంట్యాడ: డీపట్టా భూములు కలిగిన రైతులకు కూటమి ప్రభుత్వం షాక్ ఇచ్చింది. వారికి ఆభూములపై సాగు హక్కులే తప్ప మరే హక్కులూ లేకుండా చేసింది. ఆపదలు వచ్చినప్పుడు, ఆడపిల్లల వివాహాలకు డబ్బులు అవసరమై భూములను అమ్ముకుందామన్నా వీలు లేకుండా డీపట్టా భూములను హోల్డ్‌లో పెట్టేసింది. మండలంలోని మురపాక గ్రామానికి చెందిన పి.అప్పలరాజు అనే వ్యక్తికి 22 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం అర ఎకరా డీపట్టా భూమి ఇచ్చింది.ఈభూమిలో అతను వరి పంట సాగుచేస్తూ జీవనం సాగిస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆభూమిపై ఆయనకు పూర్తిస్థాయి హక్కులను కల్పించింది. దీంతో ఆయన ఎంతో సంతోషించాడు. కానీ ప్రస్తుతం అభూములను కూటమి సర్కార్ హోల్డ్‌లో పెట్టింది. ఇదే గ్రామానికి చెందిన బి.సన్యాస మ్మకు 20 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం అరఎకరా డీపట్టా భూమి ఇచ్చింది. ఆభూమిలో వరి పంట సాగుచేస్తూ జీవనం సాగిస్తోంది. ఈమెకు కూడా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆభూమిపై పూర్తి హక్కులు కల్పించింది.ఈమెకు చెందిన భూమిని కూడా కూటమి ప్రభుత్వం హోల్డ్‌లో పెట్టింది. వీరిద్దరివే కాదు. మండలంలో వందలాది మంది రైతుల డీపట్టా భూములను కూటమి సర్కార్ హోల్డ్‌లో పెట్టి వారిని నిరాశలోకి నెట్టేసింది. ప్రభుత్వ నిర్ణయంపై వారంతా మండి పడుతున్నారు.

డీపట్టాదారులకు మేలు చేసిన జగన్ ప్రభుత్వం

నిరుపేద కుటుంబాలకు 20, 25 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వాలు డీపట్టా భూములను మంజూరు చేసి పట్టాలు ఇచ్చాయి.ఎంతోమంది రైతులు డీపట్టా భూములను సాగు చేస్తూ పంటల ద్వారా వచ్చే ఫలసాయాన్ని పొందుతూ జీవనం సాగిస్తున్నారు. అయితే ఎటువంటి ఆపద వచ్చినా ఆ భూములను అమ్ము కోవడానికి వీలు కాని పరిస్థితి. ఈనేపథ్యంలో డీపట్టాలు అందుకుని 20 ఏళ్లు దాటిన వారి భూములపై వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఫ్రీ హోల్డ్(పూర్తిస్థాయి హక్కులు) కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈనిర్ణయంతో రైతులు అప్పటిలో ఎంతో సంతోషించారు. మండలంలో 400 నుంచి 500 మంది రైతులు సాగు చేసుకుంటున్న 350 ఎకరాలపై గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు పూర్తి స్థాయి హక్కులను కల్పించింది. దీంతో అత్యవసరమైన వారు డీపట్టా భూములను అమ్ముకోవడానికి అవకాశం ఏర్పడింది. ఏళ్ల తరబడి ఏ ప్రభుత్వమూ చేయని విధంగా తమకు హక్కులు కల్పించినందు కు రైతులు సంబరపడ్డారు. కానీ కూటమి సర్కార్ మళ్లీ డీపట్టా భూములన్నింటినీ హోల్డ్‌లో పెట్టేసింది. ప్రభుత్వ నిర్ణయంతో డీపట్టా భూములకు సంబంధించిన రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.

హోల్డ్‌లో 350 ఎకరాలు

> మండలంలో 350 ఎకరాల ఎసైన్డ్ భూములను ప్రభుత్వం హోల్డ్‌లో పెట్టింది. 20 నుంచి 25 ఏళ్ల క్రితం ఈభూములపై రైతులు డీపట్టాలు పొంది పంటలు సాగు చేసుకుంటున్నారు.
> – నీలకంఠేశ్వర రెడ్డి, తహసీల్దార్, గంట్యాడ

జోరుగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



గుర్ల: పెద్దబంటుపల్లి హైస్కూల్‌లో ప్రచారం చేస్తున్న పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు



వేపాడ: విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని గిరిజన పాఠశాల ఉపాధ్యాయుడిని అభ్యర్థిస్తున్న సీఐటీయూ నాయకుడు జగన్

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. పీఆర్టీయూ అభ్యర్థిగా పోటీచేస్తున్న గాదె శ్రీనివాసులునాయుడుకు మద్దతుగా గుర్ల మండలంలోని పెద్దబంటుపల్లి, గరివిడి మండలంలోని కొండపాలెం ఉన్నత పాఠశాలల్లో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు అల్తి రాంబాబు, చీపురుపల్లిలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల కళాశాల,కేజీబీవీ, శ్రీనివాస జూనియర్ కళాశాలల్లో పీఆర్టీయూ జిల్లా కార్యదర్శి ఎస్.రమేష్‌నాయుడు, జిల్లా అధ్యక్షుడు వలిరెడ్డి రవీంద్రనాయుడు తదితరులు సోమవారం ఎన్నికల ప్రచారం చేశారు. తొలి ప్రాధాన్యత ఓటును గాదె శ్రీనివాసులునాయుడుకు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. వేపాడ మండలంలోని మోడల్ స్కూల్, తదితర పాఠశాలల్లో పీఆర్టీయూ అభ్యర్థి గాదె శ్రీనివాసులనాయుడుగా మద్దతుగా పీఆర్టీయూ నాయకులు, పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మద్దతుగా సీఐటీయూ, యూటీఎఫ్ నాయకులు ప్రచారం చేశారు.

– చీపురుపల్లి/గుర్ల/చీపురుపల్లి రూరల్(గరివిడి)/వేపాడ

అప్రమత్తంగా ఉండండి



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఓ రవిప్రసాద్

గజపతినగరం: వేసవిలో అగ్నిప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువని, ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారి ఎం.ఎస్.వి.రవిప్రసాద్ సూచించారు. మండల కేంద్రంలోని తన కార్యాలయంలో సోమవారం విలేక రులతో మాట్లాడారు. ఇళ్లలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అలాగే వంటగదుల్లోకి గాలి, వెలుతురు బాగా వచ్చేలా చూసుకోవాలని చెప్పారు. వంట చేస్తున్న సమయంలో పొరపాటున దుస్తులకు నిప్పు అంటుకుంటే పరుగులు తీయకుండా నేలపై దొర్లడం లేదా దుప్పటి చుట్టుకోవడం చేయాలని సూచించారు. చిన్నపిల్లలకు అగ్గిపెట్టెలు, లైటర్లు, టపాకాయలు, ఇతర మండే పదార్థాలను అందుబాటులో ఉంచకూడదన్నారు.

పశుగ్రాస విత్తనాల పంపిణీ



పాడిరైతుకు గడ్డి విత్తనాలు అందజేస్తున్న ఏడీ డాక్టర్ శారద

చీపురుపల్లి: పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో రాయితీపై అందజేస్తున్న పశుగ్రాసం(గడ్డి) విత్తనాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.శారద సూచించారు. స్థానిక పశుసంవర్ధకశాఖ కార్యాలయం వద్ద పలువురు రైతులకు సోమవారం గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. 5 కిలోల విత్తనాల కిట్ పూర్తి ధర రూ.460 కాగా రాయితీపై రూ.115కి అందిస్తున్నామని తెలిపారు. మండలంలో ని అన్ని రైతు సేవా కేంద్రాల్లోనూ గడ్డి విత్తనాలు రాయితీపై అందుబాటులో ఉన్నాయని, రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి తీసుకోవాలని సూచించారు.

రీసర్వే చేసి నిర్వాసితులకు న్యాయం చేయండి



తహసీల్దార్ రాములమ్మకు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

వేపాడ: పెందుర్తి నుంచి బౌడారా వరకు ఎన్‌హెచ్–516 రోడ్డు విస్తరణలో స్థలాలు, గృహాలు,షెడ్‌లు కోల్పోతున్న తమకు న్యాయం జరిగేలా తమ సమక్షంలోనే రీసర్వే చేయించి నష్టపరిహారం జాబితా తయారు చేయాలని బొద్దాం గ్రామానికి చెందిన నిర్వాసితులు తహసీల్దార్ జె.రాములమ్మను కోరారు. తహసీల్దార్‌ను మండల కేంద్రంలోని కార్యాలయంలో నిర్వాసితులు ఎస్.వెంకటరమణ, వి.మహాలక్ష్మి, సత్యనారాయణ, లక్ష్మి,గౌరు నాయుడు తదితరులు సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గుర్తించిన నిర్వాసితులు జాబితాలో ఎస్.సత్యవతి, కె.లక్ష్మి, జె.గోవింద, పి.దాలమ్మ, జె.సూరిబాబు, జె.రామమూర్తి, పి.చిన్నాలమ్మ,అలమండ గోపెమ్మ, వి.గౌరునాయుడు,వెంకటేశ్వరరావు, కాంతమ్మ,జె.వి.ఎస్.నారాయణ, ఏ.కృష్ణవేణి తదితరుల పేర్లు నమోదు కాలేదన్నారు. అలాగే పలువురికి పూరి పాకలకు ఎక్కువ, పక్కా భవనాలకు తక్కువ నష్టపరిహారం ఇచ్చారని, కొన్ని రేకుల షెడ్లను జాబితాలో నమోదు చేయలేదని, ఎంత విస్తీర్ణంభూమి కోల్పోతున్నామన్న వివరాలు కూడా స్పష్టంగా లేవని వాపోయారు. తహసీల్దార్ స్పందిస్తూ సర్వే చేసి అందరికీ న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు సూర్యారావు, తదితరులు

శృంగవరపుకోట: రైతు సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ సమ్మాన్ నిధి పథకాన్ని అమలు చేస్తోందని నియోజకవర్గ బీజేపీ సీనియర్ నాయకుడు దొడ్డి సూర్యారావు తెలిపారు. స్థానిక విజన్ టెక్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగు పెట్టుబడి సాయంగా పీఎం కిసాన్ పథకం ద్వారా రాష్ట్రంలోని 42 లక్షల మంది రైతుల ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.800 కోట్లు జమ చేసిందని చెప్పారు. రైతు భద్రతే. ఆహార భద్రత నినాదంతో దేశానికి అన్నం పెట్టే రైతన్నలకు పెట్టుబడి సాయం కింద కేంద్ర ప్రభుత్వం ఏటా రూ.6వేలు అందిస్తోందని, వచ్చే ఏడాది నుంచి రూ.10 వేలకు పెంచనున్నట్లు తెలిపారు. రైతుల తరపున ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలియచేస్తున్నామన్నారు. బీజేపీ నాయకులు వారాడ చిరంజీవి యాదవ్, దాసెట్టి దాశరథి, మోపాడ అప్పారావు, గనివాడ అప్పారావు, ఎం. గంగరాజు, నానిగిరి కృష్ణ ,తదితరులు పాల్గొన్నారు.

శివరాత్రి ఉత్సవాలకు సర్వం సిద్ధం



నెలివాడ శివాలయానికి రంగులు వేసి ముస్తాబు చేసిన దృశ్యం



గెద్దపేట శివాలయం

బొండపల్లి: మండలంలోని శైవ క్షేత్రాలు ఈనెల 26న నిర్వహించనున్న మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతున్నాయి. గెద్దపేటలోని భ్రమరాంబిక మల్లికార్జునస్వామి శివాలయంతో పాటు, నెలివాడలోని శివాలయంలో ప్రత్యేక పూజలు, రుద్రాభి షేకాలు, రుద్ర హోమాలు, భారీ అన్నసమారాధన కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చే అవకాశం ఉండడంతో అందుకు తగిన విధంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. గెద్దపేట శివాలయం జైనుల కాలంలో నిర్మించినదిగా పురాణాలు, పెద్దల ద్వారా తెలుస్తోంది. ఆలయానికి ఆనుకుని ఎకరా విస్తీర్ణంలో మర్రి చెట్టు ఉండడం ఇక్కడి ప్రత్యేకత. నెలివాడలోని శివాలయం కూడా పూరాతనమైనదే. ఆలయాలకు రంగులు వేయడంతో పాటు భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి



తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని నీలకంఠరాజపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సీహెచ్.వెంకటరావు కోరారు. బల్లంకి గ్రామ ప్రాథమిక పాఠశాలలో గ్రామస్తులతో సోమవారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లలంతా బడిలోనే ఉండాలన్నారు. అయిదో తరగతి పూర్తి చేసుకుంటున్న విద్యార్థులను తమ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులున్నారని, నాణ్యమైన బోధన చేస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన సదుపాయం ఉందని, యూనిఫాం, పుస్తకాలను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. సీఆర్పీ సునంద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. – వేపాడ

పేదలకు బియ్యం పంపిణీ



వేపాడ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 240 పేదకుటుంబాలకు విశాఖపట్నానికి చెందిన మోషేస్ వెల్ఫేర్ సొసైటీ వారు బొద్దాం గ్రామంలో సోమవారం బియ్యం పంపిణీ చేశారు. మోషేస్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు మాట్లాడుతూ పేదల కోసం తమ సంస్థ ఆధ్వర్యంలో గతపదేళ్లుగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అందులో భాగంగానే బొద్దాం, వీరభద్రపేట, రామస్వామిపేట, వీరనారా యణం, సంజీవమెట్ట, ఎల్.కోట, ఎస్.కోట, జామి, బోనంగి, సవరపల్లి, కాకిపాలెం, జాగరం, జాకేరు, తదితర గ్రామాల్లోని పేదలకు బియ్యం ప్యాకెట్లు అందజేశామని తెలిపారు. – వేపాడ

పొగమంచు కమ్మేస్తోంది..



గజపతినగరంలో..

ఫిబ్రవరి నెల ముగుస్తున్నప్పటికీ పొగమంచు ప్రభావం వీడడం లేదు.గజపతినగరం మండలంలో కొద్దిరోజులుగా తెలవారు జాము నుంచి ఉదయం 8 గంటల వరకు రోజూ పొగమంచు కురుస్తునే ఉంది. సోమవారం ఉదయం గజపతినగరంతో పాటు పురిటిపెంట, ఎం.వెంకటాపురం గ్రామాల్లో దట్టంగా కురిసిన మంచు వల్ల రోడ్లు కనిపించకపోవడంతో వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. మామిడి పంటకు పొగమంచు తీవ్రనష్టం చేస్తోందని రైతులు వాపోతున్నారు. పూతమాడి పోయి రాలిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – గజపతినగరం

సేంద్రియ పంట ఉత్పత్తులతో ఆరోగ్యం



కొత్తవలసలో ప్రత్యేక స్టాల్ వద్ద ఆకుకూరలు, కూరగాయలను విక్రయిస్తున్న మహిళలు



ఎల్.కోటలో కూరగాయలు కొనుగోలు చేస్తున్న చందులూరు ఎంపీటీసీ కిశోర్, తదితరులు

కొత్తవలస/లక్కవరపుకోట: సేంద్రియ పద్ధతిలో సాగుచేసిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని వెలుగు ఏపీఎం వెంకటరమణ అన్నారు.కొత్తవలస, ఎల్.కోట మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యా లయాల వద్ద సోమవారం ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటు చేసి ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, పప్పు దినుసులను విక్రయించారు.కొత్తవలసలో ఏర్పాటు చేసిన స్టాల్ వద్ద ఆ మండలంలోని గనిశెట్టిపాలెం, చీడివలస,గొల్లలపాలెం గ్రామాల్లో రైతు సంఘాల ద్వారా పండించిన కూరగాయలు, ఆకు కూరలతో పాటు మినప, పెసర పప్పులు, ఉలవపిండి విక్రయించారు. ఎల్.కోటలో ఆ మండలంలోని మార్లపల్లి, చందులూరు, లచ్చంపేట, సంతపేట,కిత్తన్నపేట గ్రామాల రైతులు పండించిన పంటలను అమ్మకాలు చేశారు. ఆయా మండలాల రైతు సఘాల సభ్యులు,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

మహాశివరాత్రి పూజలు ప్రారంభం



గణపతి హోమం చేస్తున్న పురోహితులు శ్రీహరిశర్మ



సత్యనారాయణస్వామి వ్రతం చేస్తున్న భక్తులు

లక్కవరపుకోట: స్థానిక వీరభద్రస్వామివారి దేవాలయంలో మహాశివరాత్రి పూజలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఏకాదశి సందర్భంగా పురోహితులు ఏ.శ్రీహరిశర్మ ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాసన, గణపతి హోమం చేశారు. అలాగే సాయంత్రం తొమ్మిది మంది దంపతు లతో సత్యనారాయణ వ్రతం చేశారు. బుధవారం రాత్రి వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించ నున్న ట్లు పురోహితులు తెలిపారు.

బాల్యం నుంచే సమగ్రాభివృద్ధి



దత్తిరాజేరు: శిక్షణ ఇస్తున్న ట్రైనీ అప్పారావు



వేపాడ: టీఎల్‌ఎం చార్టులు పరిశీలిస్తున్న ఎంఈఓ నాగభూషణం

దత్తిరాజేరు: పిల్లల సమగ్రాభివృద్ధి బాల్యం నుంచే జరగాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో విద్య అందించడంతో పాటు వారు క్రమశిక్షణ అలవర్చుకునేలా చూడాలని అంగన్‌వాడీ కార్య కర్తలకు 'జ్ఞానజ్యోతి' శిక్షణ తరగతుల ట్రైనీ అప్పారావు సూచించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో మండలంలోని పలుగ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలకు అయిదో రోజు సోమవారం శిక్షణ కొనసాగింది. పిల్లల సంరక్షణ, పౌష్టికాహారం అందించడం, తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి

వేపాడ: అంగన్వాడి కార్యకర్తలు జ్ఞానజ్యోతి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకుని, పిల్లలకు సులభతరంగా ఆటపాటలతో విద్య నేర్పించాలని ఎంఈఓలు నాగభూషణం, బాలభాస్కరరావు సూచించారు. మండలంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు రెండో విడత సోమవారం నిర్వహించిన శిక్షణ తరగతులను వారు పరిశీలించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు కామేశ్వరి, భాగ్యవతి తదితరులు పాల్గొన్నారు.

నేడు మెహర్‌బాబా జయంతి

చీపురుపల్లి: స్థానిక కొత్తఅగ్రహారంలోని అవతార్ మెహర్‌బాబా కేంద్రంలో మెహర్‌బాబా జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించనున్నట్లు మెహర్‌బాబా కేంద్రం అధ్యక్షుడు పెద్ది మహేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన, 8 గంటలకు మెహర్‌బాబా సప్తవర్ణ పతాక ఆవిష్కరణ, 9 గంటల నుంచి అవతార్ మెహర్‌బాబా ఊరేగింపు, 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జన్మదిన సహవాస్ సంకీర్తనలు, సత్యప్రేమ సందేశాలు ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం హారతి, ప్రేమ విందు నిర్వహించనున్నట్లు తెలిపారు.